## క్లుప్తంగా

### మర్రివీడులో పశువైద్యశిబిరం



రైతులకు మందులు అందజేస్తున్న వైద్యులు

ఏలేశ్వరం: మర్రివీడు గ్రామంలో మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. రాష్ట్ర పశుగణాభివృద్ధి, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా ఉచిత గర్భకోశవ్యాధులకు వైద్య శిబిరం నిర్వహించారు. దీనిలో భాగంగా 42 పశువులకు చూడి పరీక్షలు, ఎదకు రాని, గర్భకోశ వ్యాధులకు పరీక్షలు చేశారు. 20 పెయ్యి దూడలకు బ్రూసెల్లా వాక్సినేషన్, 6 నెలలు దాటిన సుమారు 300 పశువులకు గాలికుంటువ్యాధి నివారణ టీకాలు చేశారు. శిబిరంలో ప్రత్తిపాడు సహాయ సంచాలకులు చిక్కం బాలచంద్రయోగీశ్వర్ మాట్లాడుతూ రైతులందరూ ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న పశు బీమాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం రైతులకు ఉచితంగా వ్యాధి నివారణ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

### భవిష్యత్తులో ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్

గండేపల్లి: భవిష్యత్‌లో ఉద్యోగాలు ఇచ్చేస్థాయికి ఎదగాలని ఆదిత్య కళాశాలల ప్రిన్సిపాల్ ఆదిరెడ్డి రమేష్ విద్యార్థులనుద్దేశించి అన్నారు. సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో పీపుల్స్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాంపై కేవీబీసీ వారిచే సెమినార్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఉద్యోగాల కోసం ఎదురుచూడడం కాదు భవిష్యత్‌లో ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలన్నారు. పారిశ్రామిక వేత్తలుగా మారేందుకు కేవీబీసీ కలిపించే సదుపాయాలను విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ పీఎస్‌వీవీఎస్ రవి కుమార్, అడ్మినిస్ట్రేషన్ డీన్ వైఈఎస్ సుబ్బారావు, ఈసీఈ విభాగాధిపతి సీహెచ్ జానకి దేవి, ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్ జగదీష్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

### పేకాట శిబిరంపై దాడి



పేకాట ఆడుతున్న వారిని అరెస్టు చేసిన జగ్గంపేట ఎస్సై రఘునాథరావు

జగ్గంపేట: స్థానిక శ్రీరామ్‌నగర్‌లో ఒక రహస్య ప్రదేశంలో పేకాటాడుతున్న శిబిరంపై జగ్గంపేట ఎస్సై రఘునాథరావు సోమవారం రాత్రి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న 8 మంది వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ 14,310 స్వాధీనం చేసుకున్నారు. జగ్గంపేట పరిసరాలలో ఎటువంటి జూదం ఆడుతున్న పోలీసులకు స్థానికులు సమాచారం అందిచాలని ఎస్సై రఘునాథరావు తెలిపారు.

### పది పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులవ్వాలి




విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ రమణ

అన్నవరం: పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఏ విధమైన భయం లేకుండా చక్కగా పరీక్షలు రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణులవ్వాలని శంఖవరం ఎంఈఓ ఎంవీ రమణ అన్నారు. స్థానిక దేవస్థానం హైస్కూల్‌లో మంగళవారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), ఐక్య ఉపధ్యాయ ఫెడరేషన్ ( యూటీఎఫ్) సంయుక్తంగా నిర్వహించిన మండల స్థాయి ప్రజ్ఞా వికాస పరీక్షలో విజేతలుగా నిలిచిన పదో తరగతి విద్యార్థులకు బహుమతి అందజేశారు. ముఖ్య అతిథులుగా ఎంఈఓ రమణ, హెచ్ఎం వేంకటేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి .టీ సీతారామ్ తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రథమస్థానం తేజస్వీ, రెండో స్థానం రోహిత్, తృతీయ స్థానం కామరాజు దక్కించుకున్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం గంగా సూరిబాబు, మండల అధ్యక్షురాలు లలిత, నాయకురాలు లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# శైవ క్షేత్రాలు సిద్ధం

- మహాశివరాత్రికి ఏర్పాట్లు పూర్తి
- వేలాదిగా తరలిరానున్న భక్తులు



ఏలేశ్వరంలో శివరాత్రికి ముస్తాబవుతున్న శివాలయం



రాచపల్లిలో అరుణాచలేశ్వరస్వామి



ధారపల్లి కొండల్లో జలపాతం



ప్రత్తిపాడులోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి వారి పంచాయతన ఆలయం

ఏలేశ్వరం: మహాశివరాత్రి పురస్కరించుకుని నియోజకవర్గ వ్యాప్తంగా మంగళవారం శైవ క్షేత్రాలు ముస్తాబవుతున్నాయి. నియోజకవర్గంలోని ఏలేశ్వరం, ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి మండలాల్లోని పలు గ్రామాల్లో విశిష్టమైన శివాలయాలు ఉన్నాయి. వీటికి వేలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉండడంతో వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ఏలేశ్వరంలోని ఏలేరునది ఒడ్డున ఉన్న శివాలయం ఎంతో ప్రత్యేకత కలిగింది. కాశీక్షేత్రంలో ఉండేలా ముఖద్వారం దక్షిణ వైపు ఉండీ ఎదురుగా శ్మశానం అనుకుని ఏలేరునది ఉండడంతో విశిష్టత నెలకొంది. శివాలయాన్ని రకరకాల రంగులతో తీర్చిదిద్దారు. రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. ప్రతి ఏడాది చుట్టు పక్కల గ్రామాల నుంచి మహాశివరాత్రికి భక్తులు వేల సంఖ్యలో వస్తారు. దీంతో ఆలయంలో అర్చకులు మహేష్, శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయం వద్ద బారికేడ్లు నిర్మించారు. విశిష్టమైన బ్రహ్మణరేవును ఆధునికీకరణ పనులు చేశారు. రేవు వద్ద శివుని విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. రేవుతో పాటు శివాలయం పరిసర ప్రాంతాల్లో వీధిదీపాలు ఏర్పాటు చేశారు.

**తీరంలో ప్రత్యేక ఏర్పాట్లు**

ఏలేరులో స్నానం మాచరించే భక్తుల కోసం ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. అలాగే స్నానమాచరించే మహిళల కోసం ప్రత్యేక గూడారాలు ఏర్పాటు చేశారు. పట్టణంలో నుంచి ఏలేరు నదికి వెళ్లే అన్నిద్వారాల వద్ద స్వాగత ద్వారాల ఏర్పాటు చేయడం సుందరంగా ప్రత్యేకత సంతరించుకున్నాయి. శివాలయం సమీపంలోని రహదారులన్నింటికి విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారు. శివాలయం సమీపంలోని కైలాసధామం అనుకుని శివుని విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



ఏలేశ్వరంలో రామలింగేశ్వరస్వామి



ఇర్రిపాకలో శివరాత్రికి ఏర్పాట్లు

**ప్రత్తిపాడు మండలంలో....**

ప్రత్తిపాడు: పర్వదినమైన మహాశివరాత్రికి శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. మండలంలోని ఎరకంపాలెం, తోటపల్లి, ధారపల్లి, ఒమ్మంగి, ధర్మవరంలలోని ఆలయాలను ముస్తాబు చేశారు. ప్రత్తిపాడులోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి వారి పంచాయతన ఆలయాన్ని విద్యుద్దీపాలతో తీర్చిద్దారు. భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు బారికేడ్లను ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ పలు ఏర్పాట్లు చేసింది.

**దారపల్లి, తోటపల్లి అటవీప్రాంతంలో**

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని శైవక్షేత్రాలు సర్వం సిద్ధమయ్యాయి. మండలంలోని రాచపల్లి అపిత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి, ఒమ్మంగి ఉమారామలింగేశ్వరస్వామి, యరకంపాలెం, దారపల్లి, తోటపల్లి అటవీప్రాంతంలో జలపాతాల వద్ద వెలసిన ధారమల్లికార్జునస్వామి ఆలయాలు ఉత్సవాలకు సన్నద్ధమయ్యాయి. ఈ ప్రాంతాలకు మండల ప్రజలతోపాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలిరానున్నారు. ఎరకంపాలెం, అరుణాచలేశ్వరస్వామి ఆలయాల వద్ద రుద్రాభిషేకం, హోమంతోపాటు పలు ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేశారు.

**తునిలో ఆలయాల ముస్తాబు**

తుని: మహాశివరాత్రి వేడుకలను ఆలయాలు ముస్తాబయ్యాయి. బుధవారం మహాశివరాత్రి కావడంతో పట్టణ పరిధిలోని శైవ క్షేత్రాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా క్యూలైన్లు, భారికేడ్లను ఏర్పాటు చేశారు. గవరపేట, పెద్దవీది, కర్రాళ్లకొండ ఆలయాలు మహాశివరాత్రి శోభను సంతరించుకున్నారు. దివాణం వీధిలో బ్రహ్మకుమారీలు ఆధ్వర్యంలో శివరాత్రిని పురష్కరించుకొని భక్తుల కోసం పుష్పలింగం ఏర్పాటు చేశారు. రెండు రోజల పాటు పరమశివుడు ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేశామని బ్రహ్మకుమారీ మాధవీలత తెలిపారు.

**కిర్లంపూడిలో...**

కిర్లంపూడి: మహాశివరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని శివాలయాల వద్ద ఏర్పాట్లను సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, తహసీల్దార్ జె.చిరంజీవి, ఎంపీడీఓ హెచ్.హరికృష్ణ, ఎస్సై జి.సతీష్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూపాలపట్నం, పాలెం, సోమవరం గ్రామాల్లోని ఉన్న ఆలయాలకు వేలాది సంఖ్యలో వచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకుని ఆలయాల వద్ద, భక్తులు స్నానాలు ఆచరించే ఏలేరు కాలువ వద్ద ఎటువంటి ప్రమాదాలకు తావులకేండా భద్రతా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేయాలని సీఐ సూచించారు. వారితో పాటు దేవదాయశాఖ అధికారులు ఉన్నారు.

**ఇర్రిపాకలో...**

జగ్గంపేట: మండలం ఇర్రిపాకలోని ఏలేరు నది తీరంలో భక్తులకు పుణ్యస్నానాలు ఆచరించేందుకు వీలుగా అన్ని సౌకర్యాలు ఏర్పాట్లు చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాలకు అభిషేకాలు చేసుకునేందుకు వీలు కల్పిస్తున్నారు. కోటిలింగేశ్వరస్వామిని, వేంకటేశ్వరస్వామిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకునేందుకు ఏర్పాటు చేశారు. నది తీరంలో ఉన్న భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి, శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయాలను సుందరంగా తీర్చిదిద్దారు.

## ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్



రౌతులపూడి జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులు తయారు చేసిన రోలింగ్ రోబోట్‌ను తిలకిస్తున్న ఎంఈఓ శ్రీనివాస్

రౌతులపూడి: ఈ నెల 28న జరిగే జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండలస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ ఎ.శ్రీనివాస్ ప్రారంభించిన ఈ కార్యక్రమంలో రౌతులపూడి, ములగపూడి, బలరామపురం జెడ్పీ హైస్కూళ్లు, ఎస్.పైడిపాల ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఆయా పాఠశాలల విద్యార్థులు తయారు చేసిన వందకు పైగా ప్రాజెక్టులను ఈ కార్యక్రమంలో ప్రదర్శించారు. రోలింగ్ రోబోట్స్, ఇన్ పాండవిక్ సిట్యువేషన్, బ్లైండ్ గ్లాసెస్, ఆటోమేటిక్ పిరియాడిక్ టేబుల్, బూమ్ బూమ్ బ్లాస్టర్, స్మార్ట్ టోల్‌గేట్, స్మార్ట్ కార్ పార్కింగ్ కాంప్లెక్స్, వాటర్ లెవెల్ ఇండికేటర్, మ్యాజిక్ మిర్రర్, రెయిన్ డిటెక్టింగ్ సెన్సార్, హైడ్రాలిక్ బ్రిడ్జి వంటి అదునాతన టెక్నాలజీకి సంబంధించిన ప్రాజెక్టులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. సైన్స్ ప్రాజెక్టుల తయారీలో మంచి తర్ఫీద్ ఇచ్చిన సైన్స్ ఉపాధ్యాయులను ఈ సందర్భంగా ఎంఈఓ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 గాడి కొండబాబు, ప్రధానోపాధ్యాయుడు కోళ్ల రాంబాబు, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు పి.అచ్చిరాజు, లోవలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వేధిస్తున్న ట్రాఫిక్ సమస్య



కోటనందూరు బస్టాండు సెంటర్లో నిలిచిపోయిన వాహనాలు

కోటనందూరు: స్థానిక బస్టాండు సెంటరును నిత్యం ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. ఈ సమస్య ఉదయం, సాయంత్రం వేళల్లో మరింత జఠిలమవుతోంది. వ్యాపారులు రోడ్డును ఆక్రమించేయడం, దుకాణాల ముందు నిలుపుతున్న ద్విచక్రవాహనాలతో ట్రాఫిక్ సమస్య అనివార్యంగా మారింది. వ్యాపారులు జేబులను నింపుకోవడం తప్పా ట్రాఫిక్ సమస్య, ప్రయాణికుల ఇబ్బందులను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. బస్టాండు సెంటరులో 60 అడుగుల వెడల్పు ఉన్న రోడ్డులో ఎదురెదురుగా వచ్చే రెండు వాహనాలు తప్పించుకునే పరిస్థితి లేదంటే సమస్యను ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఈ బస్టాండు మీదుగా రోజులో ప్రతి 10 నిమషాలకొక ఆర్టీసీ బస్సుతోపాటు సుమారు రెండు వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. బస్టాండు సెంటరును దాటాలంటే వాహనచోదకులు బెంబేలెత్తిపోతున్నారు. అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## టెక్నాలజీ రంగంలో ఉద్యోగావకాశాలు

గండేపల్లి: టెక్నాలజీ రంగంలో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పి.కృష్ణారావు అన్నారు. సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రీసెంట్ ట్రెండ్స్ ఇన్ ఎలక్ట్రిక్ వెహికల్స్ అంశంపై విద్యార్థులకు గెస్ట్ లెక్చర్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్తులో టెక్నాలజీ రంగానికి డిమాండ్ పెరుగుతుందన్నారు. కాకినాడ జేఎన్‌టీయూకే ప్రొఫెసర్, హెచ్ఓడీ కె.వెంకటరెడ్డి పాల్గొని మాట్లాడుతూ హైబ్రీడ్ ఎలక్ట్రిక్ వెహికల్స్, గ్రీన్ హైడ్రోజన్ టెక్నాలజీ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎంవీ హరనాథబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్, అకడమిక్స్ డైరెక్టర్ కె.సత్యనారాయణ, ప్రిన్సిపాల్ జి.నరేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు శిక్షణ

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య ఫార్మసీ కళాశాల ఐ క్యూ ఏసీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు రెండు రోజుల పాటు ఫ్యాకల్టీ ట్రెనింగ్ ప్రోగ్రాంను నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ కే.రవి శంకర్ తెలిపారు. ముఖ్య అతిథిగా డాక్టర్ కె.సువర్ణ లక్ష్మి పాల్గొని మాట్లాడుతూ ఆధునిక బోధనా విధానాలు, విద్యార్థుల-కేంద్రిత పద్ధతులు తదితర అంశాలపై విద్యార్థులలో విశ్వాసాన్ని పెంపొందించేలా చేస్తాయని వివరించారు. ఐ క్యూ ఏసీ కో ఆర్డినేటర్ కీర్తి సాయి, మాధవీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రేపు పాఠశాలలకు సెలవు

తొండంగి: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గురువారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ప్రభుత్వం శెలవు ప్రకటించడం జరిగిందని ఎంఈఓ షేక్‌బాబ్జి తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి నుంచి వచ్చిన ఆదేశాల మేరకు మండలంలోని 10 హైస్కూళ్లు, కేజీబీవీ, 44 ప్రైమరీ, ఏడు యూపీ స్కూళ్లతోపాటు ప్రైవేటు పాఠశాలలకు కూడా సెలవు ప్రకటించిందన్నారు.

## వైభవోపేతంగా విశ్వేశ్వరుని కల్యాణం



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ప్రత్తిపాడు: స్థానిక అన్నపూర్ణా సమేత విశ్వేశ్వర స్వామి వారి పంచాయతన ఆలయంలో సోమవారం రాత్రి విశ్వేశ్వరస్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ప్రధానార్చకులు కొత్తలంక సాయి ఆధ్వర్యంలో పురోహిత బృందం విఘ్నేశ్వర పూజతో కల్యాణ మహోత్సవానికి శ్రీకారం చుట్టారు. నూతన వధూవరులైన స్వామి, అమ్మవార్లను ఆలయ ప్రాంగణంలోని ప్రత్యేక వేదికపై ఆశీనులు చేశారు. అనంతరం బాజాబజంత్రీలు, మంగళవాయిద్యాల నడుమ వేదమంత్రోచ్చారణలతో పురోహితులు స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను, తలంబ్రాలను అందజేశారు. ఈకల్యాణ వేడుకలో ఆలయ ధర్మకర్త తేజోమూర్తుల వీరభద్రప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులతో పాటు గ్రామ ప్రజలు హాజరయ్యారు.

## రత్నగిరిపై నేడు సరస్వతి పూజ

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని సన్నిధిన బుధవారం సరస్వతి పూజ నిర్వహించనున్నట్లు దేవస్థానం అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారి నిత్య కల్యాణ మండపంలో ఉదయం తొమ్మిది గంటలకు చదువుల తల్లి సరస్వతీదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పండితులు ప్రత్యేక పూజలు చేయనున్నారు.అనంతరం విద్యార్థులు ఉత్తమ శ్రేణి మార్కులతో ఉత్తీర్ణులవ్వాలని కోరుతూ అమ్మవారికి పూజలు నిర్వహిస్తారు. ఈ పూజల్లో విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు.

## ఇద్దరి అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని వివిధ గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన దాడుల్లో ఇద్దరు సారా విక్రేతలను అరెస్టు చేసినట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ తెలిపారు. ఒమ్మంగి గ్రామంలో మొగిలి ధర్మరాజును, కిర్లంపూడి మండలం గెద్దనాపల్లి గ్రామంలో దంగేటి సూరిబాబును సారా విక్రయిస్తుండగా అరెస్టు చేశారు. ఒక్కొక్కరి వద్ద నుంచి పది లీటర్ల వంతున సారా స్వాధీనం చేసుకున్నారు. నిందితులను స్థానిక జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచి, రిమాండ్‌కు తరలించినట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ శివప్రసాద్ తెలిపారు.

## చికెన్, గుడ్లు తినడంపై అపోహలొద్దు



కత్తిపూడిలో కోడిగుడ్లు పంపిణీ చేస్తున్న మండల పశు వైద్యాధికారి కాకర్ల ప్రసాద్



మేళా నిర్వహిస్తున్న వెన్‌కాబ్ చికెన్ సంస్థ ప్రతినిధులు

శంఖవరం: కోడి మాంసం, గుడ్లపై సోషల్ మీడియాల్లో వస్తున్న అపోహలను నమ్మవద్దని మండల పశు వైద్యాధికారి కాకర్ల ప్రసాద్ అన్నారు. మంగళవారం కత్తిపూడి గ్రామంలో వేంకటేశ్వర హేచరీస్, పౌల్ట్రీయాజమానులతో కలిసి వెంకాబ్ సంస్థ ఉచితంగా చికెన్, మేళ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 200 కేజీల మాంసం, 2000 కోడి గుడ్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్యుడు మాట్లాడుతూ 70 డిగ్రీల కంటే ఎక్కువగా ఉన్న ఉష్ణోగ్రత వద్ద మాంసానికి ఎలాంటి వైరస్ సోకదన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకే ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యురాలు లావణ్య తదితరులు పాల్గొన్నారు.

రౌతులపూడి: గ్రామంలో వెన్‌కాబ్ చికెన్ తుని బ్రాంచి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత చికెన్ మేళా నిర్వహించారు. స్థానిక సుర్ల నాగబాబు చికెన్ సెంటర్ సమీపంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చికెన్ ప్రియులకు చికెన్‌పై అవగాహన కల్పించారు. సుమారు నాలుగు వందల మందికి ఉచితంగా గుడ్లు, చికెన్ ఫ్రై, చిల్లీ చికెన్ వంటి పదార్థాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకాబ్ చికెన్ ప్రతినిధులు, చికెన్ సెంటర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాల్లో బర్డ్ ఫ్లూ లేదని పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ చిక్కం బాలచంద్ర యోగేశ్వర్ తెలిపారు. స్థానిక మార్కెట్ జంక్షన్‌లో మంగళవారం సాయంత్రం శ్రీవేంకటేశ్వరా హేచరీస్ ఆధ్వర్యంలో చికెన్, ఎగ్ మేళా నిర్వహించారు. ఈ మేళాకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏడీ బాలచంద్ర యోగేశ్వర్ మాట్లాడుతూ ఒకవేళ బర్డ్ ఫ్లూతో కోళ్ళు చనిపోయినట్టు నిర్ధారణ అయితే వెంటనే గోతులు తీసి వాటిని పూడ్చిపెడుతున్నారన్నారు. ప్రస్తుతం చికెన్ గానీ, ఎగ్స్ కానీ తినడం వల్ల బర్డ్ ఫ్లూ సంక్రమించదన్నారు. చికెన్‌ను 100, 120 డిగ్రీల సెల్సియస్ వరకు ఉడికిస్తామని, 80 డిగ్రీల సెల్సియస్ దాటితే అన్ని రకాల బాక్టీరియా, వైరస్‌లు చనిపోతాయని ఏడీ బాలచంద్ర యోగేశ్వర్ వివరించారు. ప్రభుత్వ పశువైద్యశాలల వైద్యాధికారులు సుంకర వరలక్ష్మి, పి మంజూష బర్డ్ ఫ్లూపై అవగాహన కల్పించి, సందేహాలను నివృత్తి చేశారు.

## ఆక్రమణ చెరలో హైవే స్థలాలు



జగ్గంపేట హైవేపై రాళ్లు వేసి ఉన్నా షాపులు నిర్మిస్తున్న దృశ్యం(ఫైల్)

- షాపులు నిర్మించి అద్దె వసూలు
- ఇరుకుగా మారిన రోడ్లు
- తరచూ ట్రాఫిక్ సమస్యలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు, ప్రయాణికులు



షాపు నిర్మాణంలో మట్టితో కప్పేసిన రాయిని వెలికితీస్తున్న అధికారులు(ఫైల్)

జగ్గంపేట: స్థానిక జాతీయ రహదారి-16కు ఇరువైపులా స్థలాలు ఆక్రమణకు గురయ్యాయి. దీంతో రోడ్డు ఇరుకుగా మారింది. కొంతమంది స్థలాలను ఆక్రమించి దర్జాగా షాపులు నిర్మించి లక్షలాది రూపాయల అడ్వాన్స్‌లు, వేలాది రూపాయల అద్దెలకు వసూలు చేస్తూ జేబులు నింపుకొంటున్నారు. గతంలో రోడ్డు విస్తరణ పనులకు భూసేకరణ సమయంలో తమ స్థలాలకు నష్ట పరిహారం పొందిన వారే ఉన్నారు. ఇది బహిరంగంగా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జగ్గంపేటలో జేవీఆర్ సెంటర్ ప్రాంతంలో జాతీయ రహదారికి ఇరువైపులా స్థలాలు ఆక్రమణకు గురయ్యాయి. రోడ్లు ఇరుకుగా మారి, తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. జగ్గంపేటలో బ్రిడ్జి నిర్మించడంతో ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు మొదలు అయ్యాయి. ఈ ట్రాపిక్ ఇబ్బందులు లేకుండా చేయడం పోలీసుల వల్ల కూడా కావడం లేదు. మరో పక్క జేవీఆర్ సెంటర్‌లో జాతీయ రహదారి దాటుతూ ఎంతో మంది చనిపోవడం, నిత్యం ప్రమాదాలు జరగడం పరిపాటిగా మారింది. ఈనేపథ్యంలో ఇదే ప్రాంతంలో ఉన్న సైడు రోడ్లను ఆక్రమించి తోపుడు బళ్లు, పళ్ల దుకాణాలు, కొంతమంది రోడ్డుపైకి వచ్చేలా షాపులు కట్టడంతో ట్రాపిక్ సమస్య మరింత పెరిగింది. గతంలో జాతీయ రహదారి నిర్మాణం జరిగిననప్పుడు అధికారులు భూసేకరణ చేశారు. రోడ్డు నిర్మాణం తరువాత భవిష్యత్ అవసరాలకు ఉంచిన భూమికి సరిహద్దులు రాళ్లు వేశారు. ఆ భూమికి గతంలో నష్ట పరిహారం పొందిన యజమానులు ఖాళీగా ఉండడంతో తమ సొంత భూమిగా వాడుకుంటున్నారు. రాజకీయ పలుకుబడి ఉన్న కొంతమంది ఏకంగా షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించేశారు. ఇది చూసి మరి కొంతమంది జాతీయ రహదారి స్థలాలను కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టి అద్దెలకు ఇచ్చుకుంటున్నారు. దీని వల్ల బ్రిడ్జి సైడు రోడ్లు ఇరుకుగా మారి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఇదే ప్రాంతాల్లో అధికారులు తమ స్థలాలను కబ్జా చేసిన ప్రాంతాలను గుర్తించారు.అయినా మళ్లీ యథావిధిగా వాటిని ఆక్రమించేశారు. జాతీయ రహదారి అధికారులు తమ స్థలాలను ఖాళీ చేసి పార్కింగ్ స్థలాలుగా కేటాయించాలని లేదంటే బాటసార్లు వెళ్లేందుకు వీలుగా మార్చాలని గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు.

## జ్ఞానజ్యోతితో అంగన్‌వాడీల్లో బోధనాశక్తి పెంపు

- ముగిసిన శిక్షణ కార్యక్రమాలు



ఎస్.అన్నవరంలో అంగన్‌వాడీలు రూపొందించిన వస్తువులు, ప్రాజెక్టులను తిలకిస్తున్న ఎంఈఓలు



రౌతులపూడి జెడ్పీ హైస్కూల్లో శిక్షణ పొందుతున్న అంగన్‌వాడీ టీచర్లు

తుని రూరల్: జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాలతో అంగన్‌వాడీల్లో మరింత బోధనాశక్తి పెరుగుతుందని ఎంఈఓ పరవాడ గీతాదేవి, ఏసీడీపీఓ నిహారిక పేర్కొన్నారు. పాఠశాల విద్య, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సాల్ట్ ప్రోగ్రాంలో భాగంగా ఈనెల 18 నుంచి 25 వరకు ఎస్.అన్నవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో అంగన్‌వాడీ కార్యకర్తలకు సర్టిఫికేట్ కోర్సు శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా ఎంఈఓ, ఏసీడీపీఓ మాట్లాడుతూ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని అంగన్‌వాడీ వృత్తిలో మరింత సమర్థనీయంగా పని చేయాలన్నారు. మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లల సమగ్ర అభివృద్ధి, మేథో అభివృద్ధి, పిల్లలతో కలవడం, సామాజిక సంబంధాలు, ఆటపాటలు, పరిసరాలు పరిశుభ్రత, జాతీయ విద్యా విధానం తదితర విషయాలపై శిక్షణ ఇచ్చినట్టు వారు తెలిపారు. తుని పట్టణ, మండలం సెక్టార్లకు చెందిన 176 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు శిక్షణలో పాల్గొన్నారు. ముగింపు సందర్భంగా అంగన్‌వాడీలు రూపొందించిన ప్రదర్శించిన వివిధ ఆట వస్తువులు, ప్రాజెక్టులను విశేషంగా అలరించాయి. ఎంఈఓ-2 రామకృష్ణ, రిసోర్స్ పర్సన్లు రాజేంద్ర కుమార్, రాజా, వెంకటరమణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, రమణమ్మ, సరస్వతీ, హెచ్ఎం వెంకటేశ్వర్లు, సీఆర్‌పీలు, యోగా గురువులు పాల్గొన్నారు.

**ముగిసిన శిక్షణ**

రౌతులపూడి: స్లాట్(సపోర్టింగ్ ఆంధ్రస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్) పథకంలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లకు 120 రోజుల సర్టిఫికెట్ కోర్స్(జ్ఞానజ్యోతి)పై ఈ నెల 18వ తేదీ నుంచి ఆరు రోజులపాటు నిర్వహించిన శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. స్థానిక జెడ్పీ హైస్కూల్లో శంఖవరం సీడీపీఓ టీడీఆర్ పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆట, పాటల ద్వారా శారీరక అభివృద్ధి, మేధాభివృద్ధి, భాషాక్షరాస్యతాభివృద్ధి, సాంఘిక బావోద్వేగాలభివృద్ధి, సృజనాత్మకత, సౌంధర్యాభివృద్ధిపై అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రౌతులపూడి జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కోళ్ల రాంబాబు, ఐసీడీఎస్ మండల విస్తరణాధికారిణి జానకీలక్ష్మి, రీసోర్స్ పర్సన్స్ మోహన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.